క్లుప్తంగా

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన



కె.కోటపాడు ఎంఆర్సీ వద్ద నిరసన చేపడుతున్న సీఆర్పీలు

కె.కోటపాడు : సమగ్ర శిక్ష అభియాన్‌లు పని చేస్తున్న పార్ట్ టైం, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఎం.ఐ.ఎస్ కోఆర్డినేటర్ బి.నాగ సతీష్, సీఆర్పీ ఎం.భారతీదేవి కోరారు. సమస్యల పరిష్కారం కోసం కె.కోటపాడు ఎంఆర్సీ భవనం వద్ద గురువారం వీరు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాగ సతీష్, భారతీదేవి మాట్లాడుతూ ఉద్యోగులకు మినిమమ్ టైంస్కేల్(ఎంటీఎస్) అమలు చేసి వేతనాలను పెంచాలని కోరారు. సీఎం జగన్ ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేసి ఆదుకోవాలని కోరారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ శివానీ, సహిత విద్య ఉపాధ్యాయుడు సిహెచ్.కన్నమ్మ, కె.పరదేశ్, అకౌంటెంట్ అబ్దుల్ ఖాదర్, పాత్రుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు తెలుగు పద్యాల పోటీలు



కొంతలం జెడ్పీ పాఠశాలలో తెలుగు భాషా వారోత్సవం

రావికమతం : కిత్తంపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు గురువారం తెలుగు పద్యాల పోటీలను నిర్వహించారు. తెలుగు భాషా వారోత్సవాల సందర్భంగా తెలుగు భాషాభిమాని, ఆ క్లస్టర్ సీఆర్ఎంటీ రామారావు ఈ పోటీలను నిర్వహించారు. నలుగురు విజేతలను ఎంపిక చేసి బహుమతులను కూడా అందించారు.

కొంతలంలో..

రోలుగుంట: కొంతలం జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు టీచర్ సంతోషి తెలుగు భాషా వారోత్సవాలను నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో 2018 సూపర్ సింగర్ విజేత ధీరజ్ పాల్గొన్నాడు. వందేమాతరం, జనగణమన ఆలపించాడు.

20 ఏళ్లు పూర్తయిన డీ పట్టాదారుల గుర్తింపు



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాద్

మాకవరపాలెం: ఇరవై ఏళ్లు పూర్తయిన డీ పట్టాదారులను గుర్తించాలని తహసీల్దార్ ప్రసాద్ వీఆర్వోలకు సూచించారు. ప్రభుత్వం 20 ఏళ్లు పూర్తయిన డీ పట్టా భూములను జిరాయితీ భూములుగా మార్పు చేస్తున్నట్టు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం తహసీల్దార్ వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జూలై 2023 నాటికి 20 ఏళ్లు పూర్తయిన డీ పట్టాదారులను గుర్తించాలన్నారు. ఈ వివరాలను తమకు అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ శంకర్ పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో అందుబాటులో యూరియా



రైవాడ ఆర్‌బీకేలో అందుబాటులో ఉన్న యూరియా బస్తాలు

దేవరాపల్లి : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతు భరోసా కేంద్రాల ద్వారా యూరియాను సరఫరా చేస్తున్నామని మండల వ్యవసాయ అధికారి వై. కాంతమ్మ అన్నారు. ఈ మేరకు మండల వ్యవసాయ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని 20 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల అవసరం మేరకు పుష్కలంగా యూరియాను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 23 నుండి నేటి వరకు దఫ దఫాలుగా 487 మెట్రిక్ టన్నులు యూరియా సరఫరా చేశామన్నారు. ప్రస్తుతం బోయిలకింతాడ, వాకపల్లి, రైవాడ, మామిడిపల్లి, ఎ.కొత్తపల్లి రైతు భరోసా కేంద్రాలలో యూరియా అందుబాటులో ఉందని అన్నారు. దేవరాపల్లి, కాశీపురం, నాగయ్యపేట ఆర్‌బీకేలకు రెండు, మూడు రోజుల్లో యూరియా అందుబాటులోకి వస్తుందని ఏవో వై. కాంతమ్మ తెలిపారు.

మార్కెట్లలో శ్రావణ సందడి



రావికమతంలో కిటకిటలాడుతున్న ఒక వస్త్రదుకాణం



పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు



కొనుగోలుదారులతో పండ్ల దుకాణాలు



మాడుగులలో కొనుగోలుదారులతో బంగారు దుకాణాలు

రావికమతం: శ్రావణమాసం రెండో శుక్రవారం పూజలకు సంబంధించి గురువారం నాడు అన్ని గ్రామాల్లో మార్కెట్లు సందడిగా కన్పించాయి. రకరకాల పండ్లు, పువ్వులు, పత్రాలు కొనుగోళ్లు, అమ్మకాలతో రావికమతం, కొత్తకోట గ్రామాల్లో మార్కెట్లు కళకళలాడాయి. మార్కెట్లతో పాటు బంగారం దుకాణాలు కిక్కిరిసాయి. కాసు కొనుగోళ్లు జోరుగా జరిగాయి. పతి మహిళ అమ్మవారికి చీర అలంకరిస్తారు కనుక వస్త్ర దుకాణాలు కూడా కిటకిటలాడాయి.

మాడుగులలో శ్రావణ సందడి

మాడుగుల: నియోజకవర్గ కేంద్రం మాడుగులలో గురువారం శ్రావణ మాస సందడి నెలకొంది. శుక్రవారం జరగనున్న వరలక్ష్మీ దేవి పూజలకు సర్వం సిద్ధం అవుతున్నారు. ఈ నేపథ్యంలో మాడుగులలో బంగారుదుకాణాలు, పండ్ల దుకాణాలు, కూరగాయలు దుకాణాలు, పూలుదుకాణాలు, కొనుగోలు దారులుతో కిటకిటలాడాయి. పండ్ల ధరలు బాగా పెరిగాయి. అరడజను రూ.50లున్న బత్తాయి, పండ్లు రూ.100 పెరిగాయి. డజను అరటి పండ్లు రూ.200 పలికాయి.

నర్సీపట్నం : నర్సీపట్నంలో రోజువారి మార్కెట్‌కు శ్రావణ శోభ నెలకొంది. శ్రావణ శుక్రవారం పూజకు అవసరమైన పూజా ద్రవ్యాలు కొనుగోలు చేసేందుకు మార్కెట్‌కు పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చారు. అబిద్‌సెంటర్ ప్రాంతంలో కొనుగోళ్లదారులతో సందడి నెలకొంది. పూలు, పండ్లు, పూజా ద్రవ్యాల దుకాణాలు కొనుగోలుదారులతో సందడి మారాయి. పెళ్లిళ్ల సీజన్ కావడంతో పూల ధరలకు రెక్కలు వచ్చాయి. మార్కెట్‌కు భారీగా మహిళలు తరలిరావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. పోలీసులు ఎప్పటికప్పుడు స్పందించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ఇస్రో ఘనతకు అక్షర వందనం



ఇస్రో విజయానికి శుభాకాంక్షలు చెబుతూ కస్తూర్బా పాఠశాల విద్యార్థుల అక్షర విన్యాసం

కె.కోటపాడు /రోలుగుంట : చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడం దేశానికే గర్వకారణమని కింతాడ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ బి.చిన్నమ్మలు అన్నారు. పాఠశాలలో గురువారం విద్యార్థినులు ఇస్రో అక్షరరూపంలో విన్యాసం చేశారు. రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వరప్రసాద్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.



రోలుగుంటలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

కొండల మీద గ్రామాలకు మట్టి రోడ్డు ఏర్పాటు



అధికారులకు సూచనలు చేస్తున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం : రోడ్డు సౌకర్యం లేని గిరిజన గ్రామాలకు ఉపాధి హమీ పథకంలో యుద్ధ ప్రతిపాదికన మట్టి రోడ్డు ఏర్పాటు చేయాలని ఎంపీపీ సాగిన లక్ష్మణ మూర్తి అన్నారు. ఆయన గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. సరుగుడు సుందరకోట పంచాయతీలో 16 శివారు గ్రామాలు ఉన్నాయని వాటిలో కొండలు మీద ఉన్న గ్రామాలకు నేటికి రోడ్డు లేక గిరిజనులు అనేక బాధలు పడుతున్నారన్నారు. ఇటీవల కలెక్టరు రవి పట్టాన్ శెట్టి బమ్మిడికలొద్దు పర్యటనకు వచ్చినప్పుడు గిరిజన గ్రామాలు రోడ్లు గురించి అడిగడంతో రోడ్లు వేస్తానని హామీ ఇచ్చారు. దీంతో కొండల మీద ఉన్న తొరడ, ముంతమామిడిలొద్దు, బమ్మిడికలొద్దు, శిరిపురం, కొత్తదద్దుగుల, కొంత లంకలు గ్రామాలకు మట్టి రోడ్డు కోసం పంచాయతీ తీర్మానాలు ఇవ్వడం జరిగిందన్నారు. గత ఏడాది కలెక్టరు అసనగిరి గ్రామానికి వచ్చినప్పుడు అక్కడ గిరిజనుల బాధలు చూసి సుందరకోట గ్రామం నుంచి అసనగిరికి ఉపాధి హమీ పథకం నిధులతో మట్టి రోడ్డు ఏర్పాటు చేసారన్నారు. మిగతా గ్రామాలకు మట్టి రోడ్డు వేయాలని అధికారులకు సూచించారు.

పారదర్శకంగా రేషన్ పంపిణీ

• జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి మూర్తి



మాట్లాడుతున్న జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి కె.వి.ఎల్.ఎన్.మూర్తి

నర్సీపట్నం:ప్రజలకు పారదర్శకంగా రేషన్ పంపిణీ చేయాలని ఎండీయు ఆపరేటర్లకు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి కె.వి.ఎల్.ఎన్.మూర్తి సూచించారు. నర్సీపట్నం డివిజన్‌లోని ఎండీయు అపరేటర్లతో గురువారం ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి రేషన్ పంపిణీ విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్న శ్రీకాకుళం జిల్లాలో ఇంటింటికి రేషన్ విధానం విజయవంతమైందన్నారు. దీంతో మిగిలిన జిల్లాలో ఈ విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ విధానం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఎండీయు అపరేటర్లు పారదర్శకంగా పని చేసి రేషన్ లబ్ధిదారుల ఇంటికి చేర్చాలన్నారు.

ఘనంగా మరిడమ్మ తల్లి పండగ



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

నాతవరం: మండలంలో గురువారం మర్రిపాలెం వై.బి.పట్నం, నాతవరం, వల్సంపేట గ్రామాల్లో మరిడమ్మ తల్లి పండగను భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. మండల కేంద్రంలో గల ఆలయంలో అమ్మవారిని మహిళలు అధిక సంఖ్యలో దర్శించుకుని పసుపు కుంకుమ చీర జాకెట్టు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ భక్తులకు తీర్థ ప్రసాదాలు తాగునీరు అందజేసింది వై.బి.పట్నం, వల్సంపేట, మర్రిపాలెం గ్రామాల్లో ఆలయాల వద్ద కూడా భక్తుల సందడి నెలకొంది. ఈ పండగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొంటే పంటలు బాగా పండుతాయని ఈ ప్రాంతీయుల నమ్మకం.

మాకవరపాలెం: మండలంలోని బూరుగుపాలెంలో మరిడమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. ఏటా స్థానికులు ఈ పండగను ఘనంగా జరుపుకొంటారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం నుంచి భక్తులు గ్రామంలో ఉన్న ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

విద్యుత్ మీటర్ నంబర్‌కు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి



ఏఈ నందన్

రావికమతం : మండలంలోని విద్యుత్ వినియోగ దారులంతా వారి మీటర్ నంబర్‌కు ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ నందన్ గురువారం సూచించారు. మండలంలో 19,080 మంది వినియోగదారులున్నారని తెలిపారు. ఇకపై బిల్లులన్నీ యాప్ ద్వారా చెల్లించుకునే వెసులుబాటు వస్తున్న దృష్ట్యా ఆధార్ అనుసంధానం చేసుకోవాలన్నారు. అలాగే కుటుంబంలో మృతి చెందిన వారెవరైనా ఉంటే వారి వారసులు సంబంధిత పత్రాలు తెచ్చుకుంటే వారి పేరున మీటర్ మార్పు చేస్తామన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

నర్సీపట్నం : మున్సిపల్ పారిశుద్య కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ మున్సిపాలిటీ జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. జనాభాకు తగినట్టుగా పారిశుద్య కార్మికులు లేకపోవడంతో కార్మికులపై పని భారం పడుతుందన్నారు. బిస్స్, పుష్ కార్డులు, చీపుర్లు ఇతర పనిముట్లు సరిపడా ఇవ్వడం లేదన్నారు. కార్మికులకు యూనిఫాం, గ్లౌజులు, సబ్బులు, కొబ్బరి నూనెలు ఇవ్వడం లేదన్నారు.

జోరుగా గొరిగెడ్డ వంతెన పనులు



వంతెన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ రాజారామ్

మాడుగుల : మండలంలో కింతలి వల్లాపురం గ్రామం నడుమ రూ.30 లక్షలతో నిర్మాణం అవుతున్న గొరిగెడ్డ వంతెన నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. వారం రోజులు కిందట ప్రారంభమైన వంతెన పనిర్మాణ పనులు 50 శాతం పూర్తయ్యాయి. ప్రస్తుతం వంతెనకు గొట్టాలు నిర్మాణం జరుగుతుంది. దీంతో వైస్ ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకట రాజారామ్ సర్పంచ్ తాళ్ళపురెడ్డి రాంబాయిలు వంతెన నిర్మాణ పనులు గురువారం పరిశీలించారు. పనులు నాణ్యంగా జరుగుతుండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమన్నదొర, రాంబాబు పాల్గొన్నారు.

భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు



మాట్లాడుతున్న ఎస్ఐ రామకృష్ణారావు

మాకవరపాలెం: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్ఐ రామకృష్ణారావు సూచించారు. అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం పాలిటెక్నిక్ విద్యార్థులకు ర్యాగింగ్ నిరోధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండడమేగాక రోడ్డు భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు, పాటిటెక్నిక్ ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడారు.

పల్లె ముంగిటకే వైద్యం

మాడుగుల: ఒకప్పుడు వైద్యం అందుకోవాలంటే నాలుగైదు కొండగెడ్డలు దాటుకుని సుమారు 10 కిలోమీటర్లున్న మండల కేంద్రానికి రావాలి. మండల కేంద్రాల్లో ఎప్పుడైనా ఉచిత వైద్యశిబిరాలు ఏర్పటు చేసినా సరే రాలేని పరిస్థిలున్న జేడీపేట పంచాయతీ ఎల్. కృష్ణాపురం గిరి గ్రామం. కానీ నేడు ఆ గ్రామానికి జేడీపేట వద్ద వంతెన నిర్మాణం జరిగింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అట్టడుగునున్న నిరుపేదలకు వైద్యం అందించాలని ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ఏర్పాటు చేసి నెలకు రెండుసార్లు మారు గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడంతో నిరుపేదలకు ఎంతో మేలు జరుగుతుంది. దీనిలో భాగంగా ఈ గ్రామంలో గురువారం నిర్వహించిన వైద్యశిబిరంలో కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.ఎం.నాయుడు ఆధ్వర్యంలో సుమారు 200 మందికి బీపీ, సుగర్, తదితర వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

నేడు ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం

మాడుగుల రూరల్ : కేజేపురంలో శుక్రవారం ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం జరగనుందని, నిర్వాహకులు కాళ్ళ అమ్మతల్లి నాయుడు, చిన్నారి తెలిపారు. ఈ శిబిరం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుందన్నారు. శిబిరానికి వచ్చేవారు పాత రిపోర్టులు తీసుకురావాలని కోరారు.

రైతులకు రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలి

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్

నర్సీపట్నం: కేంద్ర ప్రభుత్వ విధానాలతో వ్యవసాయరంగం సంక్షోభంలోకి కూరుకుపోయిందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ పేర్కొన్నారు. బీకేఎంయు జిల్లా మహాసభ నేపథ్యంలో ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ గురువారం నర్సీపట్నంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రైతులకు రూ.5 వేలు పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు అమలు చేయాలన్నారు. పేదలకు భూములు పంచాలన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వ్యవసాయ రంగాన్ని గాలికి వదిలేసారన్నారు. సమాచార, అటవీ హక్కుల చట్టాలను కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కొండలరావు, మాకిరెడ్డి రామునాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, దొరబాబు, వెంకట జగ్గారావు, సుబ్బలక్ష్మి, గురుబాబు పాల్గొన్నారు.

బీమా సాయం పంపిణీ



నామినీకి బీమా సహాయ చెక్కును అందజేస్తున్న దృశ్యం

చోడవరం రూరల్ : మండలంలోని లక్ష్మీపురం ప్రాథమిక సహకార సంఘ సభ్యులు వివిధ కారణాలతో తొమ్మిది మంది చనిపోగా వారి వారసులకు గురువారం బీమా సహాయాన్ని అందచేశారు. ఒక్కొక్కరికి రూ.30 వేలు బీమా సొమ్ము మంజూరు కాగా సంఘ చైర్మన్ శానాపతి సత్యారావు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, చోడవరం శాఖ మేనేజర్ కె.శ్రావణ్‌కుమార్, సూపర్‌వైజర్ జి.రవితేజ లబ్ధిదారులైన నామినీలకు అందచేశారు. ఈ సందర్భంగా సంఘ చైర్మన్ ఎస్.సత్యారావు మాట్లాడుతూ ఈ ఏడాది రైతులకు రూ.3.5 కోట్లను రుణాలుగా అందచేసామని, మరో రెండు కోట్ల రూపాయలను వ్యవసాయేతర రుణాలుగా అందించామన్నారు. 2019-20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సంఘ సభ్యులకు రూ.4.15 లక్షలు వడ్డీ రాయితీ కింద రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందని చెప్పారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో సంఘం రూ.4.80 లక్షలు లాభాన్ని ఆర్జించినట్టు చైర్మన్ సత్యారావు తెలిపారు. కార్యక్రమంలో సీఈవో జి.వి. సత్యనారాయణ, డైరెక్టర్లు తాళపురెడ్డి వెంకట సత్యవీరునాయుడు, బలిరెడ్డి సత్యారావు, జాజిమొగ్గల శ్రీను పాల్గొన్నారు.

పాడిరైతులను ప్రోత్సహించేందుకే ప్రదర్శనలు



పాడిరైతులకు బహుమతులు అందజేస్తున్న పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి ప్రసాదరావు

మాకవరపాలెం: పాడిరైతులను ప్రోత్సహించేందుకు లేగదూడల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్టు పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి డి.ప్రసాదరావు తెలిపారు. మండలంలోని లచ్చన్నపాలెంలో గురువారం నిర్వహించిన లేగదూడల ప్రదర్శనకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా హెచ్ఎఫ్, జర్సీ, ఇతర జాతులకు చెందిన 35 లేగదూడలను ఇక్కడ ప్రదర్శించారు. వీటిని పరిశీలించి దృఢంగా, ఆరోగ్యంగా ఉన్న మూడు దూడలను ఎంపిక చేసి రైతులకు బహుమతులు అందజేశారు. వీటి సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రసాదరావు విలేకర్లతో మాట్లాడుతూ పాడిపరిశ్రమ అభివృద్ధికి రైతులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ఈ ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా పాడి రైతులకు 75 శాతం రాయితీపై గడ్డి విత్తనాలు, పశుదాణాతోపాటు గడ్డి కోత యంత్రాలను 60 శాతం రాయితీపై అందిస్తున్నామన్నారు. వర్షాకాలం ప్రారంభం అయినందున పశువులకు వచ్చే వ్యాధులపై జిల్లా వ్యాప్తంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ముద్ద చర్మం వ్యాధి నివారణకు నెలరోజులుగా టీకాలు వేస్తున్నామన్నారు. గొంతు, జబ్బ, చిటికె, పి.పి.ఆర్ వ్యాధుల నివారణకు అవసరమైన అన్ని మందులు కూడా సిద్ధంగా ఉంచామన్నారు. ఇక పశువులకు అత్యవసర చికిత్సలు అందించేందుకు 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే మొబైల్ వాహనం పశువు వద్దకే చేరుకుని సిబ్బంది సేవలు అందిస్తారన్నారు. దీనిని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పల్లాలో 13 వాహనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కోటవురట్ల ఏడి సింహాద్రప్పుడు, మాకవరపాలెం పశువైద్యాధికారి అశోక్, పాల సంఘ అధ్యక్షుడు సర్వేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ గిరిబాబు

గొలుగొండ: వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ప్రతి గ్రామ సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు కష్టపడి పనిచేయాలని, ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో కీలకపాత్ర పోషించాలని జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, మండల పార్టీ అధ్యక్షుడు లెక్కల సత్యానారాయణ, మండల సచివాలయం కన్వీనర్లు సంఘం అధ్యక్షులు కొరుప్రోలు పాణీశాంతారామ్ తెలిపారు. గురువారం నాగాపురం, కృష్ణదేవిపేట, కొంకసింగి, ఏఎల్‌పురం గ్రామ పరిదిలో ఉన్న ఐదు సచివాలాలయాల పరిధిలో ఉన్న కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతి ఇంటికీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలు ప్రజలకు వివరించాలని, మరలా సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి గెలుపుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లోచల సుజాత, పందిరి సత్యంనాయుడు, యలమంచిలి రఘురాం పాల్గొన్నారు.

గిడుగు వల్లే వ్యవహారిక భాషకు వెలుగు



విద్యార్థులకు తెలుగు భాష కోసం వివరిస్తున్న ఎంఈవో 1, 2 సత్యనారాయణ, ప్రసాద్

కె.కోటపాడు : గ్రాంధిక భాషగా ఉన్న తెలుగును వ్యవహరిక భాషగా మార్చిన ఘనత గిడుగు రామ్మూర్తి పంతులకు దక్కుతుందని మండల విద్యాశాఖాధికారి 1, 2 సత్యనారాయణ, డి.వి.డి.ప్రసాద్ అన్నారు. ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం తెలుగు భాషా వారోత్సవాల కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావు ఆధ్వర్యంలో జరిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో 1, 2 సత్యనారాయణ, డి.వి.డి.ప్రసాద్‌లు గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా వారు గిడుగు తెలుగు భాషాభివృద్ధికి చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. తెలుగు భాషా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పద్య పఠన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు వి.అర్జునరావు, భారతి, పైడయ్య, వి.బంగారునాయుడు పాల్గొన్నారు.

సూర్రెడ్డిపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సుబ్రహ్మణ్యం

కె.కోటపాడు : ఇంటి పరిసరాల్లో వర్షాకాల సమయాల్లో మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలను తీసుకోవాలని ప్రజలకు చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి బి.సుబ్రమణ్యం తెలిపారు. సూర్రెడ్డిపాలెం గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను అందించారు. 86 మందికి ఆరోగ్య పరీక్షలు చేయడంతో పాటు గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు జరిపారు. అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలతో పాటు జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌వీ అచ్చియ్యమ్మ, హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, ఏఎన్ఎం దేవి, ఎంఎల్‌హెచ్‌పీ హైమ, రమణ పాల్గొన్నారు.

కొండెక్కిన పూలు, పండ్ల ధరలు



కొత్తూరు జంక్షన్ వద్ద పండ్ల దుకాణాల వద్ద రద్దీ

చోడవరం: పట్టణంలో మార్కెట్‌కు శ్రావణ శోభ వచ్చింది. పండ్లు, పూలు, వస్త్రాలు, బంగారం కొనుగోళ్లతో హడావిడి నెలకొంది. కొత్తూరు జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, పాత బస్టాండ్, చినబజార్ వీధులు జనంతో రద్దీగా మారాయి. పండ్లు, పువ్వుల ధరలు ఆకాశాన్నంటాయి. సాధారణ రోజుల్లో అరడజను యాపిల్స్ రూ.80కి విక్రయించగా, ఇపుడు రూ.120కిపైగానే ధరలకు విక్రయించారు. ద్రాక్ష కిలో రూ.100, బత్తాయి డజను రూ.110, దానిమ్మ అరడజను రూ.100లకు విక్రయించారు. కాగా చోడవరం శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి, దుర్గా దేవి, గోవాడ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు.